భూమికి సారం.. వారికి జీవనాధారం

- సేంద్రియ ఎరువుగా గొర్రెలు, మేకల వ్యర్థాలు
- భూసారం పెంచే దిశగా అడుగులు


పొలంలో మేత మేస్తున్న గొర్రెలు

తాడేపల్లి రూరల్: మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందుల వినియోగంతో భూసారం తగ్గిపోతోంది. ఇలాంటి చర్యలు భవిష్యత్ తరాలకు ప్రతికూలంగా మారుతాయని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పలు సందర్భాల్లో రైతులకు అవగాహన కలిగిస్తూ వస్తున్నారు. దీంతో రైతుల ఆలోచనా విధానంలోనూ మార్పు వస్తోంది. దీంతో పాత సంప్రదాయ పద్ధతుల్లోనే భూసారం పెంచేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందులో ప్రధానమైనవి గొర్రెలు, మేకల మందలను కాపు కాయటం, చెరువు పూడిక మట్టిని పొలాల్లో వేయడం, కుళ్లిన గత్తం వేసుకోవటం, పచ్చిరొట్ట సాగు వంటి పద్ధతులు పాటించడం వంటివి చేస్తున్నారు.

జీవాలతో వలస....

పొలంలో జీవాల మందల కాపు కాయటంతో భూమికి సారంతో పాటు పెంపకందారులకు ఆదాయమార్గంగా ఉంటుంది. దుగ్గిరాల మండలంలోని పెదపాలెం, చినపాలెం, వీర్లపాలెం, మంచికలపూడి, తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరు, ప్రాతూరు, మంగళగిరి రూరల్‌లో నూతక్కి, ఆత్మకూరు, కాజ, చినకాకాని తదితర ప్రాంతాల్లో జీవాల మంద కాపు కాసేవారు ఉన్నారు.

తక్కువ ఖర్చుతో....

పగలంతా మేతకు వెళ్లి గొర్రెలు, మేకల మందను రాత్రికి రైతు పొలానికి తీసుకువస్తారు. రాత్రంతా పొలంలో ఉంచుతారు. ఒక రాత్రి పొలంలో ఉంచడానికి అవి వేసే పేడ వల్ల భూసారం పెరుగుతుంది. ఒక రాత్రి రైతు పొలంలో మంద ఉండేందుకు 30 కిలోల బియ్యం, రూ.300, కూరగాయలు తదితరాలు జీవాలు పెంచే వారికి రైతులు ఇస్తారు. ఎకరా పొలంలో నాలుగైదు రాత్రులు మంద కాపు కాయడం వల్ల భూమి సారవంతంగా మారుతుంది. పంట సమయంలో ఎరువులు, పురుగుల మందుల ఖర్చు సగానికి తగ్గిపోతుంది. పురుగుల మందు, ఎరువుల అవశేషాల్లేని పంట దిగుబడులను సాధించవచ్చు.

వేసవిలో అనుకూలం...

గొర్రెలు, మేకల(జీవాల) మందలను కాపుకాసేందుకు వేసవి అనుకూలం. ఖరీఫ్ తరువాత రబీలో ఆరుతడి పంటలు, వాణిజ్య పంటలు వేసుకుంటారు. పంట కోత తరువాత మందలు కాపుకాస్తారు. వేసవి వర్షాలు పడినప్పుడు పొలం దుక్కి చేస్తారు. ఆ సమయంలో గొర్రెల, మేకల వ్యర్థాలు భూమిలో కలిసి భూసారాన్ని పెంచుతాయి. ఈ వ్యర్థాలు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.

ప్రతి సంవత్సరం గొర్రెల మందలు వస్తాయి



మా గ్రామంలో ఉన్న గొర్రెలు, మేకలు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మా పంటపొలాల్లోకి మేతకోసం వచ్చేవి. ముఖ్యంగా పల్నాడు జిల్లా నుంచి ఎక్కువ మంది మందలు మందలుగా గొర్రెలు తీసుకువచ్చేవారు. ఒక్కొక్క మందలో వెయ్యి నుంచి 2 వేల వరకు ఉండేవి. ఒక్కరాత్రి పంటపొలంలో అవి నిద్రిస్తే 20 నుంచి 30 ఎరువు కట్టలతో సమానం. ఈ సంవత్సరం ఎండాకాలం పల్నాడులో వర్షాలు పడడంతో ఆ ప్రాంతం నుంచి మేతకు మందలు రాలేదు.

– సురేష్, చిర్రావూరు రైతు

భూసారం పెరుగుతుంది....



పొలంలో గొర్రెలు, మేకల మందలను కాపుకాయడం వల్ల భూసారం పెరుగుతుంది. పురుగుమందుల వినియోగం తగ్గుతుంది. పంట దిగుబడుల్లో ఎరువులు, పురుగుల మందుల ప్రభావం లేకుండా ఉంటుంది. ఎరువుల వాడకంతో మిత్ర పురుగులు నశిస్తాయి. భూమి పొరల్లో ఉండే మిత్ర పురుగుల సంఖ్య పెరుగుతుంది. ఏటా మందల కాపుకాయటం వల్ల భూమి సారవంతంగా ఉంటుంది.

– శిరీష, ఏఓ, దుగ్గిరాల

ముగిసిన సాయినాథుడి బ్రహ్మోత్సవాలు

స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీ షిర్డీ సాయినాథ మందిరంలో నిర్వహిస్తున్న 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఉదయం మంగళ ధ్వని, కాకడా హారతి, వేద పఠనం, బాబాకు పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. అలంకార పూజ, సహస్ర నామార్చనలను అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాబాకు ఆలయ అధ్యక్షుడు మామిడి సీతారామయ్య దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం సాయి కోటి స్తూపంలో పుస్తకాలను భక్తులతో నిక్షిప్తంగావించారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాల్ని ఆలయ గౌరవ అధ్యక్షుడు మామిడి రామారావు పర్యవేక్షించారు.

– నగరంపాలెం


బాబాకు లక్ష మల్లెల అర్చన


భక్తులకు అన్నప్రసాద వితరణ

పర్యావరణ పరిరక్షణతోనే భావితరాల మనుగడ


ఉపాధ్యాయ బృందంతో విష్ణువర్ధన్, కృష్ణవేణి, పద్మజ


మొక్కలు నాటుతున్న వాసవీ క్లబ్ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ఇంజినీర్ సదాశివం


టీజేపీఎస్ కళాశాల ప్రాంగణంలో మొక్క నాటుతున్న కె.వి. బ్రహ్మం, మనోహర్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణతోనే భావితరాల మనుగడ సాధ్యపడుతుందని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా బుధవారం లక్ష్మీపురంలోని పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ పుడమి రక్షణ మన భవిష్యత్తుకు శ్రీరామరక్ష అన్నారు. అందరూ ప్రకృతిని ప్రేమిస్తూ, పర్యావరణాన్ని రక్షిస్తూ ముందుకు సాగితేనే భావితరాలకు మనుగడ సులభతరం అవుతుందని తెలిపారు. ఊపిరినిచ్చే చెట్టుని కాపాడితే ఊపిరిని పోసి జన్మనిచ్చిన తల్లిలా కాపాడుతుదని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత తెలుపుతూ నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, సీనియర్ కోఆర్డినేటర్ డి. దుర్గా శ్యామ్, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ శ్రీదేవి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణానికి మేలు

నెహ్రూనగర్: మొక్కల పెంపకంతో పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని గుంటూరు వాసవీ క్లబ్ చైర్మన్ నగేష్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం 53వ డివిజన్‌లోని మున్సిపల్ స్కూలులో గుంటూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఎంతో ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సెక్రటరీ ఆంజనేయులు, మాజీ సైనిక ఉద్యోగి షేక్ మౌలాలి, విద్యా కమిటీ మెంబర్ పీటర్ పాల్, పాఠశాల హెచ్ఎం రమేష్ పాల్గొన్నారు.

పర్యావరణానికి తీవ్ర విఘాతం

లక్ష్మీపురం: మానవుని స్వార్థపూరిత చర్యల మూలంగా గతంలో ఎన్నడూ లేనంతంగా పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోందని విశ్రాంత ఇంజినీర్, పర్యావరణ పరిరక్షణ ప్రచారకులు ఎస్. సదాశివం అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని, ప్రభుత్వాలు కూడా ఈ దిశగా కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని 'మన భూమి-మన భవిష్యత్తు' అనే నినాదంతో జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రాం సూచించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, పర్యావరణ పరిరక్షణ ఉద్యమ నాయకులు పి.ఎస్.మూర్తి ప్రసంగించారు.

జీవకోటి మనుగడకు మొక్కలు నాటాలి

గుంటూరు ఎడ్యుకేషన్: భూమిపై మానవజాతితో పాటు సమస్త జీవకోటి మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేసినప్పుడే సకాలంలో వర్షాలు పడతాయని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే కృత్రిమ రసాయనాలు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ ఏటా పర్యావరణ దినోత్సవాన్ని కళాశాలలో విధిగా నిర్వహిస్తూ, మొక్కలు నాటుతున్నామని తెలిపారు. భావితరాలకు పచ్చదనంతో నిండిన స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భాను మురళీధర్, గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్ కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిణి ఆర్. జయ శైలజ, మేజర్ పి. కుమార్ రాజా, పి. అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

తరిగిపోతున్న పచ్చదనంతోనే అధిక ఉష్ణోగ్రతలు

గుంటూరు ఎడ్యుకేషన్: పచ్చదనం తరిగిపోతున్న కారణంగానే సమస్త జీవకోటి భరించలేని అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కర్పూరపు రామకృష్ణప్రభు పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సంగడిగుంటలోని కళాశాలలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న కారణంగా భూమిపై జీవరాశులు తల్లడిల్లిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెట్ల నరికివేతతో ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయని చెప్పారు. భూతాపాన్ని తగ్గించేందుకు విరివిగా మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. కళాశాల కమిటీ సభ్యుడు కర్పూరపు సూర్యనారాయణ మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణంలో కాలుష్యం తరిగిపోయి, పుష్కలంగా ఆక్సిజన్ అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి ఏ. శ్రీధర్, అధ్యాపకులు రాజరాజేశ్వరి, ఇందిర, ప్లేస్‌మెంట్ అధికారి చంద్రశేఖర్, కల్చరల్ కో-ఆర్డినేటర్ మధుసూదన్, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్క నాటి, నీరు పోస్తున్న రామకృష్ణప్రభు, శ్రీనివాసరావు

తెనాలిలో చిరుజల్లులు



తెనాలిఅర్బన్: తెనాలిలో బుధవారం సాయంత్రం చిరు జల్లులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ వేడిమితో జనం అల్లాడారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి చిరుగాలులు వీచాయి. అనంతరం చిరు జల్లులతో కూడిన వర్షం కొద్దిసేపు పడింది. దీంతో ప్రజలు కొంత సేదతీరారు.

బాల సాహిత్య పుస్తకావిష్కరణ



తెనాలిఅర్బన్: తెలంగాణ సారస్వత పరిషత్ వారు రూపొందించిన 'బాల సారస్వతం' పిల్లల కథల పుస్తకాన్ని బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలలో బుధవారం పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు చెందిన రచయితలు పంపిన 117 కథలతో సంస్థ వారు అయిదు పుస్తకాలు ముద్రించినట్లు తెలిపారు. తెనాలికి చెందిన బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీం జానీ రూపొందించిన నాలుగు గుండిగలు కథ కూడా పుస్తకంలో ఉందన్నారు. అనంతరం హకీం జానీని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి పావని, ఏ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మాదల విద్యార్థినికి నీట్‌లో 619 మార్కులు



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామానికి చెందిన గుంటూరు షణ్ముకమాల్య మంగళవారం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో 619 మార్కులు సాధించింది. మాదల గ్రామానికి చెందిన గుంటూరు శ్రీనివాసరావు హైదరాబాద్‌లో స్థిర పడ్డాడు. షణ్ముక మాల్య అక్కడే ఉన్న ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్‌మీడియట్ చదివి 972 మార్కులు సాధించింది. నీట్ పరీక్షకు హాజరై మొదటి విడతలోనే 619 మార్కులతో ఆలిండియా కోటాలో 60,062 ర్యాంకు సాధించింది. కేటగిరిలో 22,016 ర్యాంక్ సాధించింది.

క్లుప్తంగా

చిన్నారులకు టీకాలు వేయించాలి



ఫిరంగిపురం: చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని వైద్యాధికారి పి.ఎస్తేరు రాణి తల్లలకు సూచించారు. మండలంలోని రేపూడిలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 212 మందికి పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈసందర్భంగా చిన్నారుల తల్లులకు టీకాలు వేయించడం వలన కలిగే ఫలితాలు గురించి వివరించారు. పుట్టిన వెంటనే బీసీజీ, హెపటైటిస్ బీ, విటమిన్ కే, పోలియో చుక్కలు వంటివి వేయించాలని కోరారు. తరువాత పెంటావైలెంట్, పీసీవీ, ఐపీవీ, రోటా వైరస్ టీకాలు వేయించాలని చెప్పారు.

గోడౌన్‌కు ఈవీఎంలు తరలింపు

ఫిరంగిపురం: ఎన్నికల అనంతరం ఈవీఎం యంత్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు వాటిని మండలంలోని రేపూడి గ్రామంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని గోడౌన్‌కు తరలించారు. కాగా వాటిని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన రెవెన్యూ సిబ్బందితో వాటిని భద్రంగా గోడౌన్‌లో భద్రపరిచినట్లు తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది తెలిపారు. భద్రపరుస్తున్న తీరును తహసీల్దార్ రాఘవేంద్రరావు, డిప్యూటీ తహసీల్దార్ రాజారమేష్ పర్యవేక్షించారు.

ఎన్నికల్లో ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయం

ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు

గుంటూరు మెడికల్: ఎన్నికల నిర్వహణలో ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయమని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. ఏపీ ఎన్జీవో హోంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న నారా చంద్రబాబునాయుడుకు ఉద్యోగుల పక్షాన అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఉద్యోగులు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్, సాంకేతిక అంశాల్లో సహాయ సహకారాలు అందించిన ఎన్నికల కమిషన్, జిల్లా యంత్రాంగానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కరోనా సమయంలో ఉద్యోగులు ప్రాణాలకు తెగించి సేవలు అందించారన్నారు. ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వం ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకొని సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా సంయుక్త కార్యదర్శి కురాకుల శ్రీనివాసరావు, ఏ.శ్యామ్ సుందర్ శ్రీనివాస్, గుంటూరు నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్. సూరి, కార్యదర్శి సీహెచ్. కళ్యాణ్ కుమార్, ప్రత్తిపాడు తాలూకా అధ్యక్షుడు సీహెచ్. అనిల్ కుమార్, సునీల్ కుమార్, వేణుగోపాల్, ఇస్సాకు పాల్గొన్నారు.

రోగులకు సంచుల పంపిణీ



గుంటూరు మెడికల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా బుధవారం జీజీహెచ్ నాట్కో సెంటర్‌లో 300 మంది రోగులకు కీర్తన ట్రస్ట్ అధ్యక్షురాలు మేరీగ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్లు ఆశా సజని, గంగమ్మ, కిరణ్మయి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శత చండీ హోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం మాస శివరాత్రి సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ శత చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది మంది వేద పండితుల నిర్వహణలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు జరిపారు. లక్ష్మీ గణపతి, చండీ, రుద్ర హోమాలు చేపట్టి, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జన్మదిన వేడుకలు

తెనాలి: స్థానిక షరాఫ్ బజారులోని శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీ హనుమత్ గాయత్రీ హోమం, 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, సాయంత్రం స్వామి వారికి 1108 లడ్డూల అర్చన చేశారు. పండితులు వైదిక క్రతువును ఆగమోక్తంగా నిర్వహించారు. శ్రీ హనుమాన్ చాలీసా పారాయణలో మహిళా భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త ములుకుట్ల విశ్వనాథ శర్మ సుందరకాండ ప్రవచనం చేశారు. భక్తులు విశేషంగా పాల్గొని ఆంజనేయ స్వామికి ప్రదక్షిణాలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకల్లో భాగంగా జూన్ 11వ తేదీ వరకు వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, 16వ లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిరోజు 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, స్వామి వారికి విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు తీసుకోవాలని కోరారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్బీ శివ, నిఖిల్ శాండిల్య, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన సేవాసమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, ఉప్పల వరదరాజులు, మడుపల్లి చంద్రశేఖర్, ఆర్.సురేష్, ఎం వెంకటేష్, బి.లీలాప్రసాద్, గోలి సోమశేఖర్, సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.


ఆంజనేయునికి లడ్డూలతో అర్చన

పేదలకు వస్త్రాలు పంపిణీ

తెనాలిరూరల్: సినీ దర్శకుడు దిలీప్‌రాజా తన జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు నూతన వస్త్రాలు అందజేసి వారితో కలిసి భోజనం చేశారు. తెనాలి మండలం కొలకలూరు గ్రామంలో కాల్వ కట్ట వెంబడి కొంతమంది నిరుపేదలు నివసిస్తున్నారు. తన జన్మదినం సందర్భంగా బుధవారం అక్కడకు వెళ్లిన ఆయన వారికి వస్త్రాలు ఇవ్వడంతో పాటు ఆహార పొట్లాలు అందజేసి వారితో కలిసి భోజనం చేశారు.

నూతక్కి అబ్రహాం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

తెనాలిరూరల్: మధుర కవి నూతక్కి అబ్రహాం విగ్రహాన్ని తెనాలి బండ్‌పై ఏర్పాటు చేయాలని మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం(మాస్) సభ్యులు కోరారు. 'మాస్' రాష్ట్ర నాయకులు కూచిపూడి మోహన్ మాదిగ ఆధ్వర్యంలో రూరల్ మండలం కొలకలూరు గ్రామ సెంటర్ వద్ద గుర్రం జాషువా ప్రియ శిష్యుడు నూతక్కి అబ్రహాం 25వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ మాట్లాడుతూ గుర్రం జాషువా గబ్బిలం రచిస్తే శిష్యుడు అబ్రహాం మత్కుణం మీద రాసిన పద్యం మరువలేనిదని అన్నారు. న్యాయవాది సుద్దపల్లి మురళీధర్ మాట్లాడుతూ తెనాలి బండ్‌పై అబ్రహాం విగ్రహాన్ని ఏర్పాటు చేసే విధంగా ఎమ్మెల్యే మనోహర్ చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సుద్దపల్లి అంబేడ్కర్, భవనాసి హేబెల్, మోదుకూరి దావీదు, ఉన్నం జానుబాబు, ఉన్నం చిన్నజాను, ఉన్నం సన్నీ, ఉన్నం గోపి, ఉన్నం ఇమ్మానుయేలు, జర్నలిస్ట్ నూతక్కి ఆచారి, నూతక్కి స్వరాజ్ వర్మ పాల్గొన్నారు.


కవుల చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న సభ్యులు

ముగిసిన హనుమత్ జయంత్యుత్సవాలు



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 1/2వ అడ్డరోడ్డులోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం హనుమత్ జయంత్యుత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా అన్నదానం జరిపారు. తొలుత స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు జంధ్యాల శివప్రసాద్, పవన్‌కుమార్, కళ్యాణ్ పాల్గొన్నారు.